# మీమీదొట్లు



ప్రతిమనిషికి ఎన్నో అనుభవాలు ఉంటాయి. కొన్ని వినూత్నంగా ఉంటాయి. కొన్ని విలక్షణంగా ఉంటాయి. అలాంటి ఒక అనుభవాన్ని చెప్పరాదూ... కథగా మలుచుకొనడానికి వీలుంటుందేమో?

నా ఎదురుగా చేతులు కట్టుకుని బుద్ధిగా కుర్చున్న కుమార్, ఆ మాట వింటూనే చిరునవ్వు నవ్వాడు.

నవ్వు నాలుగువిధాల చేటంటారు కానీ, నవ్వడం చేతనయితే మనిషి ఎన్ని అర్థాలు వ్యక్తం చేయవచ్చునో?

కుమార్ నవ్వును గమనిస్తూంటే– 'నీకు నేను నా అనుభవాలు చెప్పాలా? కథ రాసుకోటానికి?' అన్న భావన తొణికిసలాడుతూ ఉంది.

గ్రహించాను.

"లేదు కుమార్! నేను తమాషాకు అడగటంలేదు. నిజంగానే అడుగుతున్నా!" అమాటంటూ నేను టేబిలుమీద గ్లాసు చేతికందుకొన్నాను.

అది చూస్తూ కుమార్ తలవంచుకొన్నాడు.

నా చేతిలోగ్లాసు తెల్లగా తుల్యంగా ఉంది. అందులోద్రవం ఒక మోస్తరుగా కుళ్ళినటెంకాయ నీళ్ళరంగును తలపింపచేస్తూ ఉంది. ఆ ద్రవంపేరు జిన్. 'లింకా'తో కలిపిన జిన్!

ఈ మధ్యనే నేను తాగటానికి అలవాటు పడ్డాను.

ఒకప్పుడు పక్కన మనిషి సిగరెట్టు తాగితే చీదరించుకొనేవాడిని. అలాంటి వాడిని ఈ వేళ తాగుడులో తెలివి మీరిపోయాను.

ఇంకొక శుభవార్త ఏమిటంటే- శ్రీరాముడిది ఒక్కటే బాణం! ఒక్కటే మాట!- అంతటి పేరుసాధించాలంటే ఇన్ని తాగుళ్ళు మాని ఒక్క తాగుడుకే కట్టుబడితే అది సాధ్యమవుతుందేమో? అని ఈ మధ్యనే కాఫీ టీ పాలు అదిగాగల ద్రవపదార్థాలకన్నింటికి స్వస్తి చెప్పేశాను.

మనిషికి ఇన్ని తాగుళ్ళు ఉండకూడదంటూనే తాగుడులోని రకాల్ని తరచి తరచి రుచిచూశాను. ఆ రుచుల్ని ఎదుటి మనిషి వింటూంటే నోట్లో నీళ్ళూరే అంతకమ్మగా చెప్పగలను కూడా!

జిన్ అయితే లింకాతోనో కాదు లెమనైడ్‌తో కలుపుకుంటే అద్భుతంగా ఉంటుంది. లింకా, లెమనైడ్ దొరకనిపక్షంలో రెండు నిమ్మబద్దలు వేసి సోడా కలుపుకొన్నా రుచిలో పెద్దగా మార్పు కనిపించదు. ఐతే దానిని 'లేడీస్ డ్రింక్' అంటారు. కాబట్టి తీసుకోవడం నామోషీగా ఉంటుంది. రమ్ కోకాకోలాతో కలిపితే ఆ టేస్టే అద్భుతం. కానీ 'రమ్' గుర్రాలకు తాగిస్తారని అంటారు. కాబట్టి నలుగురిలో 'రమ్' మాటెత్తడం 'స్టేటస్' మీద దెబ్బ తీసినట్లుంటుంది. బ్రాందీ ఐతే ఫరవాలేదు. సోడాలో కలిపి నాలుగు మంచుముక్కలు వేసుకొంటే గొంతులో నుండి దిగజారేదే తెలియదు. ఇక విస్కీ అంటేనా? దాని సంగతి చెప్పక్కర్లేదు. అది రాజులకు రాజు. తాగుడు ప్రియులకు అదంటేనే మహారంజు!

"ఇంతేనా నీకు తెలిసింది?" అని మీరనుకుంటే పప్పులో కాలేసినట్లే!

సోడాను ఒకవేలితో కొట్టడం... అట్లా కొట్టిన సోడాను బొటన వ్రేలితో మూసిపెట్టి బాగా కుదిలించి చిమ్మన గ్రోవితో చిమ్మించినట్లు గ్లాసులో నింపడం... మూతలు రాకుండా మొరాయిస్తే నోటితో పట్టి లాగడం... ఖాళీ అయిన మందుసీసాలో అగ్గిపుల్ల వెలిగించి వేస్తే అది చిత్రంగా శబ్దంచేస్తూ మండితే- గర్వంగా నవ్వడం వగైరా వగైరాపనుల్లో కూడా ఆరితేరానులెండి!

ఈ తాగుడు ఒక్కరోజు చిత్రంగా నా అనుభవంలోకి వచ్చింది.

పేరూ వివరాలెందుకు కానీ- తొలి పరిచయంతోనే అతడు నన్నాకట్టుకొన్నాడు. ఆ తరువాత ఒకరంటే ఒకరికి గౌరవాభిమానాలు కట్టలు తెంచుకొన్నాయి. ఆ ప్రవాహంలోపడి కొట్టుకపోతున్న రోజుల్లో ఒకరోజు అతడు నన్ను భోజనానికి పిలిచాడు.

అతడు పిలిస్తే నాకే కాదు కాదనే శక్తి ఎవ్వరికీ ఉండదు.

వెళ్ళాను. వెళ్ళి ఆ ఇంట్లో కూర్చుంటే కంటికి కనిపిస్తున్న ప్రతి వస్తువు ఒక కళాఖండంలా ఉంది. అమర్చిన తీరు అతని కళాభిరుచికి దర్పణం పట్టినట్లుంది.

అతడు అందంగా ఉంటాడు. అతని మనసు అందమయింది. అతని అభిరుచి కూడా అందంగా ఉంటుంది. అయితే ఇంత అందంగా ఉంటుందని మాత్రం ఊహించలేదు అదే ఆలోచిస్తూ కూర్చుని ఉంటే పిలువు వచ్చింది. లేచి ఇంట్లోకి నడిచాను. భోజనాల గదిలో అడుగుపెడితే కాలుముందుకు పడలేదు. కంటిమీద రెప్ప పడలేదు.

ఎదురుగా ఒక సౌందర్యరాశి! కవి కలానికి చిత్రకారుని కుంచెకు వొదగని సౌందర్యరాశి! రెండు చేతులు జోడించి చిరునవ్వుతో ఆహ్వానిస్తూ ఉంది. వర్ణించడం తిన్న ఇంటికి వాసాలెంచినట్లవుతుంది. ఎంతో ప్రయత్నించి మనస్సును స్వాధీనంలోకి తెచ్చుకొన్నా– ఎక్కడో లవలేశం ఈర్ష్య! అదృష్టాన్ని గంపలకెత్తి ఒక వ్యక్తి మీదనే కుమ్మరించిన దేవుడిమీద కసి... కోపం!

ఈ దురభిప్రాయాలకన్నింటికీ జాగ్రత్తగా చిరునవ్వు పులిమి కుర్చీపై కూర్చున్నాను.

అతనిది పరిమిత కుటుంబం. అంటే వాళ్ళిద్దరు. వాళ్ళకు ముగ్గురు. ఇద్దరు కొడుకులు. ఒక కూతురు. పనసతొనల్లా మిసమిసలాడుతున్నారు. అతడు నా పక్కన కూర్చున్నాడు. ఆ పిల్లలు ముగ్గురు మాకు ఎదురుగా కూర్చున్నారు. అందమైన ప్లేట్లలో ఆమె రకరకాల పదార్థాల్ని నింపి, టేబులు మీద పెట్టింది. ఆ తరువాత ఆరుగ్లాసుల్ని టేబిలుమీద పెట్టింది. మంచినీళ్ళకోసమేమో అనుకొంటుంటే ఆమె మూడు గ్లాసుల్లో బీరు నింపింది. ఆ మూడు గ్లాసుల్లో ఒక్కొక్క పెగ్ విస్కీ పోసింది. చల్లని నీటితో నింపి చాలని కొదువకు ఐస్ ముక్కల్ని కూడా వేసింది.

నేను తెల్లపోయి చూస్తున్నాను.

ఆమె నావైపు చిలిపిగా చూస్తూ చిరునవ్వు నవ్వుతూ గ్లాస్‌ను ఒకచేత్తో పైకెత్తి పట్టి 'ఛీర్స్' అనింది. బీర్ గ్లాసులు చేతపట్టి పిల్లలు ముగ్గురు ముక్తకంఠంతో 'ఛీర్స్' అంకుల్ అంటున్నారు. నానిస్సహాయస్థితిని గమనించి అతడు లోలోపలే నవ్వుకొంటున్నాడు. అయితే ఆమె 'ఛీర్స్' అంటుంటే అనకుండా ఉండడం ఎవరి తరం కాదేమో? ఆరోజు తాగేటప్పుడు కాస్త ఇబ్బందనిపించినా, ఆ తరువాత మాత్రం హుషారుగానే ఉండింది.

ఇలా అనుభవానికి వచ్చిన తాగుడు ఇప్పుడు అలవాటయి కూర్చుంది.

అలవాటవుతున్న తొలిరోజుల్లో శ్రీమతిగారు నన్ను చూసి చిరచిరలాడితే అంతకుమించి నేను చిటపటలాడేవాడిని. చేతికెదిగిన బిడ్డలముందర నామోషీగా ఉంటుందని ఆమె మౌనవ్రతం ఆరంభించింది. ఆమెతో పెద్దగా అవసరం లేని వయస్సు. ఆ వయస్సులో నా అవసరాలు పిల్లలకే పరిమితాలు. అవి వాళ్ళే తీర్చేవాళ్ళు. అది గమనించి ఆమె వాళ్ళమీద అనవసరంగా

విరుచుకుపడేది. తాము చేసిన తప్పేమిటో? అమ్మ ఆగ్రహానికి కారణమేమిటో? అర్థంచేసుకోలేని పిల్లలు బిక్కమొగం వేసేవాళ్ళు. వాళ్ళేంచేస్తారు పాపం. అడకత్తెరలో పోకలు!

మౌనవ్రతం లాభం లేదనుకొనింది శ్రీమతి. ఉన్నట్లుండి ఒక రోజున నిరాహారదీక్ష ఏనోటీసు లేకుండానే ప్రారంభించింది. నోటీసులేకుండా నిరాహారదీక్ష ప్రారంభించడం నేరం. ఆనేరానికి తగినచర్య కూడా తీసుకోవచ్చు. అయినా ఎందుకొచ్చిన గొడవ?

తాగినపుడు ఏ కొద్దిమందినో మినహాయిస్తే చాలామందికి బాగా తినాలనిపించదు. అలా తినాలనిపించని వాళ్ళల్లో నేనూ ఒకడిని. బాగా తినకపోతే అది మనల్ని తింటుందని కూడా తెలుసు. అలా తింటూ తింటూ ఒక నాటికి పూర్తిగా తినేస్తుందనీ తెలుసు. అయినా 'నేడే నిత్యము' కదా?

తాగినపుడు నా వరకు పెద్దగా తినాలనిపించదు కాబట్టి నేను తినను. నేను తాగుతూ తినలేకపోతున్నానన్న కోపంతో శ్రీమతి తినదు. మేమిద్దరం తినలేదని పిల్లలు తినరు. పిల్లలు తినకపోతే మాతృహృదయం అంగీకరించదు. వాళ్ళను తినమంటే మళ్ళీ తననే తినమంటారు. తాను తినకపోతే వాళ్ళు తినరు. మళ్ళీ రంపు. రంపు తర్వాత కన్నీళ్ళు. కన్నీళ్ళ తరువాత కాస్త రిలీఫ్! ఆ రిలీఫ్‌లో మళ్ళీ అంతా మామూలే!

ఈ ఫరిస్థితుల్లోనే ఈ దేశంలో మౌన వ్రతాలు...నిరాహారదీక్షలు వీగిపోతున్నాయని పాపం! ఆ పిచ్చిదానికేం తెలుసు?

ఇప్పటికి అర్థం చేసుకొన్నట్లుగా ఆఇల్లాలు తన అయిష్టతను ఇంకొక విధంగా వ్యక్తం చేయడానికి ఆరంభించింది. ఎక్కడైనా పార్టీలో కూర్చొని కాస్త ఆలస్యంగా ఇంటికి వస్తే ఆమె తలుపుతీసేది కాదు. ఇంటినిండా కటిక చీకటి. గొంతుచించుకున్నా దబదబా తలుపు బాదినా ప్రయోజనం ఉండేది కాదు. ఇక్కంటి పక్కింటివాళ్ళు ఆ అరుపులకు మేలుకొని తొంగి తొంగి చూస్తుంటే...నిజంగా తలకొట్టేసినంత పని అయ్యేది. అప్పుడే గనుక ఆ తలుపు బిగించిన మనిషి ఎదుట ఉంటే– ఉండదు కాబట్టే నేను తల బాదుకొనేవాణ్ణి!

ఈ గొడవలంతా ఎందుకని నేనిప్పుడు ఇంట్లోనే దుకాణం పెట్టేశాను. చీకూచింతలేని పని. తాగినంత సేపు తాగవచ్చు. ఆమీదట అలానే పడి తూలవచ్చు. అలా అలా అలవాటు పడి శ్రీమతి కూడా కంపెనీ ఇస్తే మహద్భాగ్యం. మా దాంపత్యాన్ని ఈ నవనాగరికలోకం చేతులెత్తి ఆశీర్వదించదూ?

ఈ నా అభిప్రాయానికి భిన్నంగా కుమార్ వంచినతల ఎత్తలేదు.

కుమార్ నా బాల్య స్నేహితుడు. మేమిద్దరం ఒకే పల్లెలో పుట్టాం. ఒకే మట్టిలో ఆడుకొన్నాం. ఒకే వీధిబడిలో కలిసి చదువుకొన్నాం.

ఆ పల్లెలో కుమార్‌కి తాత ముత్తాతలు సంపాదించిన బోలెడు ఆస్తి ఉంది.

నా తెలివితేటలే నాకు ఆస్తిగా మిగిలాయి.

ఇద్దరం డిగ్రీలు సంపాదించుకొన్నా, కుమార్ తన జీవితాన్ని పల్లెకే పరిమితం చేసుకొన్నాడు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయిస్తున్నాడు. వాడి జీవితం ఆ పల్లెలో మూడు పువ్వులారుకాయలుగా వెలారుతూ ఉంది.

కడుపుచేత పట్టుకొన్నవాణ్ణి కాబట్టి నాకు ఉద్యోగాన్వేషణ తప్పలేదు. తెలివి పెట్టుబడి కాబట్టి ఆ అన్వేషణలో నేనేమీ పెద్దగా తికమకలు పడలేదు. మంచి ఉద్యోగమే దొరికింది. ఉద్యోగి రచనావ్యాసంగం బంగారానికి వన్నెపెట్టినట్లుగా వన్నెమీరుతుంది.

ఆ పట్టణంలో నా పరపతి బాగా పెరిగింది.

మా మార్గాలు వేరైనా మా మనస్సులు వేరుకాలేదు.

వీలైతే నేను వెళ్ళడం....లేకుంటే వాడు రావడం...కాసేపు హాయిగా కబుర్లాడు కోవడం...కలిసి భోంచేయడం...సరదాగా సినిమాలు చూడడం. వాడు వస్తే ఒకటి రెండు రోజులు హాయిగా గడిచిపోయేది కాలం.

నేను తాగడానికి అలవాటుపడిన తర్వాత వాడు రావడం ఇదే ప్రథమం.

కుమార్ వంచిన తల ఎత్తలేదు.

ఏదైనా తన అనుభవాన్ని నెమరేసుకొంటున్నాడా? లేక నా తాగుడును అసహ్యించు కొంటున్నాడా?

అర్థం కావడంలేదు. అదే నేను ఆలోచిస్తూంటే కుమార్ తల పైకెత్తాడు. వాడి కళ్ళను ఎర్రపోర ఆవరించింది. నీళ్ళు కూడా కమ్ముతున్నాయేమో? అయినా నిబ్బరించుకొంటున్నాడు.

"నువ్వెందుకు తాగుతున్నట్లు?"

సూటిగా చూస్తూ అడుగుతున్నాడు కుమార్.

"అనుభూతికోసం!"

"ఎలా ఉంటుందా అనుభూతి?"

"తాగితే తెలుస్తుంది."

"తాగి తెలుసుకున్నావు కదా? చెప్పు వింటాను."

"అనుభూతి ఆత్మపరమైనది కుమార్! వివరణలకు లొంగదు. అనుభూతి అనుభవైకవేద్యమే!"

"నువ్వొక రచయిత అన్న మాట మరిచిపోవద్దు"

"మరిచిపొయ్యుంటే కథకోసం ఏదైనా ఒక అనుభవం చెప్పమని నిన్నెందుకడుగుతాను?"

"అడిగావు కాబట్టే అడగవలసి వచ్చింది. ఒకనాడు ఆంధ్రప్రదేశ్ నీ కథలంటే పడిచచ్చింది. నీ కథకోసం తహతహలాడింది. తీసుకొనే వస్తువు...చెప్పేతీరు....నీది నీదే అని గొంతెత్తి చాటింది. అవన్నీ ఈరోజు ఏమయ్యాయి? అనుభూతిలో అంతర్లీనమయ్యాయా?"

"కుమార్!"

"ఎందుకలా గొంతు చించుకుంటావ్? ఈరోజు ఆ స్థాయినుండి పూర్తిగా కిందపడి అనుభవం కోసం నన్నడుగుతున్నావ్! సిగ్గులేదూ?"

"కుమార్! అక్కడికి నిలుపు!"

"అవును. మాటలకు చేతలకు సంబంధంలేని రచయితలు పుట్టిన దేశంలో పుట్టిన నేనొక సామాన్యుణ్ణి. మాట్లాడే అర్హత నాకెక్కడిది? ఆపుతాను."

"కుమార్! ఇది నా వ్యక్తిగత విషయం."

"వ్యక్తి సమాజంలో ఒక మనిషి. ప్రతిమనిషి 'వ్యక్తిగత విషయం' అన్న సాకుతో తనకు తోచిన తప్పు తాను చేస్తూ కూర్చుంటే– ఏమవుతుందీ సమాజం? ఈ మాత్రం ఆలోచించలేని నువ్వు తగుదునని కలం పట్టుకొన్నావు మేధావిలా లోకాన్ని ఉద్ధరించడానికి. నిజంగా ఎంతో సంతోషించవలసిన విషయం."

నా అహానికి ఎక్కడోచాలా సునిశితంగా దెబ్బ తగిలింది.

ఆ దెబ్బను తట్టుకోవటం కష్టమనిపించింది.

టేబిలుమీద గ్లాసు చేతికందుకొని ఒక్క గుక్కలో ఖాళీ చేశాను.

ప్రాణానికి ప్రాణమైన మిత్రుడు కాకుండా ఉంటే ఎట్లుండేదో? మాట పెగల్లేదు. మౌనంగా తలవంచుకొన్నాను.

"సరే నీ వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి నేనెవర్ని?"

గుండెల్లో పిడిబాకును దించినట్లు వినిపించిందామాట.

చివుక్కున తలపైకెత్తి చూశాను.

"అవునురా! కట్టుకున్న పెండ్లాం...కన్నబిడ్డలు...కడకు ఊపిరి సలపని పనుల్లో ఉక్కిరి బిక్కిరవుతూ కూడా ఊపిరిగానిన్ను భావించి నీకోసం వచ్చిన నీ మిత్రుడు– ఎవ్వరూ ఇవ్వలేని అనుభూతిని ఆ తాగుడు ఇవ్వకలుగుతుందంటే తలవంచాల్సిందే!– నీ పెళ్ళాం తలవంచింది. నీ బిడ్డలు వంచారు.నేనూ తలవంచుతున్నాను. సాగించు. కొనసాగించు అనుభూతుల అంచులు తాకేదాక కొనసాగించు".

వాడి గుండెల్లో బాధ రగిలి ఆవిరిగా కండ్లలోకి ప్రాకి నీలాలుగామారి చెంపలమీద ముత్యాలుగా నిలిచాయి. ఎంత తుల్యంగా ఉన్నాయి ఆ కన్నీళ్ళు!– జిన్నంత తుల్యంగా ఉన్నాయి!!

జిన్ను తాగడమా? కన్నీళ్ళను తాగడమా? సందిగ్ధావస్థలో పడ్డాను. ఆ పరిస్థితిని ఎక్కువ సేపు కొనసాగనివ్వలేదు కుమార్!

"కథకు ప్లాట్– అదే అనుభవం కావాలన్నావుగదా?"

ఆ మాట చెవినిపడడంతో ఎక్కడలేని హుషారు కలిగింది. గబగబా గ్లాసులో అంతజిన్ను పోసుకొని సోడా కలిపి కొట్టేశాను. జాగ్రత్తగా విందామన్న ఆసక్తితో తెంపుగా కూర్చున్నాను.

"లేచి నడిచే ఓపిక ఉందా నీలో"

సందేహంగా అడిగాడు కుమార్.

"ఎందుకు నీకా సందేహం?"

"అయితే బయలుదేరు".

రాత్రి పదిగంటలవేళ ఎక్కడికి? ఎందుకు? అని అడక్కుండా లేచి నిలబడ్డాను. ఇంట్లో శ్రీమతి పిల్లలు తినకుండా మాకోసం ఎదురుచూస్తుంటారని తెలుసు. అయినా ఎన్ని దినాలు ఎదురుచూడలేదు. అసలు తినకుండానే పడుకోలేదు. అలాంటప్పుడు ఈ ఒక్కరోజుతో కొంపలు మునిగేదేముంది? ఇలాంటి ఆలోచనలన్నీ కట్టిపెట్టి కుమార్ వెంట బయలుదేరాను.

ఇద్దరం ఇంట్లోనుండి వీధిలో పడ్డాము. ఆ వేళప్పుడు కూడా వీధిలో వస్తూపోతున్న వాహనాలతో 'ఎవరెన్ని విధాల మొత్తుకొన్నా మాదారి మాదే!' అని రోడ్లమీదపడి అడ్డదిడ్డంగా నడుస్తున్న 'రోడ్‌సెన్స్' లేని మందల్లాంటి మనుషులతో గజిబిజిగా ఉన్నాయి– నామనసు మాదిరిగానే! రిక్షాలోపోతున్న ఒక్కడు రోగంవొచ్చిన కోడిమాదిరి మెడవాలేసి రోడ్డుమీదనే కక్కుతూ పోతున్నాడు. మరొక్కడు రోడ్డంతా తనదే అన్నట్లుగా ఈపక్కనుండాపక్కకు ఆపక్కనుండి ఈపక్కకు తూలుతూ వాగుతూ... వాగుతూ తూలుతూ నడుస్తున్నాడు. ఒంటిమీద బట్టలకు కూడా బాగా కైపెక్కినట్లుంది. వాటిదారి వాటిదిగానే ఉంది.

మౌనంగా నడుస్తున్న కుమార్ ఒక్క చూపు విసిరాడు నామీద. తట్టుకోవడం కష్టమే! అయినా తమాయించుకొన్నాను.

గజిబిజిగా ఉన్న వీధుల్లో ఒకరిపక్కన ఒకరు నడుస్తున్నాం. మాలో మాటలు లేక కాదు– మాటలు రాలేకపోతున్నాయి. ఏదో గమ్యాన్ని చేరుకోవాలన్న లక్ష్యంతో కుమార్ నడుస్తూంటే అతన్ని వెంబడించడమే నా కర్తవ్యంగా ముందుకు పోతున్నాం.

కుమార్ నన్నెక్కడికి తీసుకపోతున్నాడో? పోతే అక్కడేం చూడాల్సివస్తుందో? చూస్తే ఆ సంఘటన తీరుతెన్నులు ఎలా ఉంటాయో? కథకు ఉపకరిస్తుందో లేదో? అసలే మనిషి కోపంగా ఉన్నాడు. కోపంలో మనిషి విచక్షణ కోల్పోతాడు. ఫలితం ఎలా ఉంటుందో? అయినా తినబోతూ రుచిని గూర్చిన ఊహాగానాలెందుకు? పరిపరివిధాల ఆలోచిస్తూ ఉంది మనసు.

ఒక హోటల్ ముందు నిలబడ్డాడు కుమార్. ఒక్కసారి ఆ హోటల్ని తేరిపారచూశాడు. తరువాత నన్ను కిందినుండి పైకి పైనుండి కిందికి ఎగాదిగ చూశాడు. మెల్లగా హోటల్లోకి దారితీశాడు. నేను అతన్ని అనుసరించాను.

ఆ ఊరికంతటికి అదొక పెద్దహోటల్. ఏడంతస్తులమేడ. ఆ ఏడంతస్తులకింద భూగర్భంలో భోజనశాల. అంటే– అండర్‌గ్రౌండ్ రెస్టారెంట్. ఆ అండర్‌గ్రౌండ్ రెస్టారెంట్ నుండి బయటికి ఒకటే దారి ఆదారి మొగదల నిలబడ్డాడు కుమార్. నేనూ అతని పక్కన్నే నిలబడ్డాను.

ఆదారిమీద తెల్లటి యూనిఫారంలో సర్వర్లు పరుగులు తీస్తున్నారు. కొందరి చేతుల్లో భోజనాల ప్లేట్లున్నాయి. మరికొందరు టిఫిన్లు మోసుకపోతున్నారు. కొందరు 'మందు' సేవించడానికి కావలసిన అనుపానాలు అంటే సోడా, ఐస్ ముక్కలు వగైరాల్ని తీసుకొని పోతున్నారు. వాళ్ళు ఒక్కమోపున మెట్లెక్కి దూకినట్లుగా దిగుతూంటే కండ్లు జిగేల్ మంటున్నాయి. ఏమాత్రం కాలుజారినా ఎమవుతారో? అన్న గగుర్పాటు కలుగుతూ ఉంది. రెస్టారెంట్ కే వెళ్ళి తృప్తిగా భోంచేసినవాళ్ళు తేపుతూ మెల్లగా మెట్లెక్కి వస్తున్నారు.

కుమార్ అక్కడెందుకు నిలబడ్డాడో? అర్థంకాకుండా ఆలోచిస్తూ వస్తూ పోతున్నవాళ్ళని చూస్తూ నిలబడ్డాను.

పట్టుమని పదినిమిషాలు గడిచాయి.

గబగబా మెట్లెక్కి పైకివస్తున్న అతణ్ణి చూసి చిత్తరువులా నిలబడిపోయాను.

తెల్లటి హోటల్ యూనిఫారం...తలమీద టోపీ...చేతుల్లో ఒక ట్రే... ఆ ట్రేలో సోడా సీసాలు...మంచుముక్కలు... మరికొన్ని తినుబండారాలు!

గబగబా మెట్లెక్కుతూ అతడు నన్ను చూశాడు. నేనతణ్ణి చూశాను. మా చూపులు ఒక్క క్షణం కలుసుకొన్నాయి. ఆ క్షణంలోనే కొన్ని ఏండ్ల అనుభవాల్ని కూడపలుక్కొన్నాయి. అతడు ఒక్కక్షణం తటపటాయించి అతి కష్టంమీద తమాయించుకొని నన్ను చూసీ చూడనట్లుగా తల వంచుకొని చరచరా వెళ్ళిపోయాడు.

నా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి!

ఎక్కడ మా ఊళ్ళో మిద్దింటాయనకొడుకు? ఎక్కడి రూంబాయ్!?

ఒక్కసారిగా పాతాళంలో పడిపోయింది నా మనస్సు.

దీనితో ఎలాంటి సంబంధం లేనట్లుగా ముఖంలో ఎటువంటి భావాల్ని వ్యక్తం చేయకుండా కేవలం ఒక ప్రేక్షకుడుగా నిలబడి ఉన్నాడు కుమార్!

ఇంక అక్కడ నిలబడటం నా శక్తికి మించిన పనిగా తోచింది. వంచిన తల ఎత్తకుండా బయలుదేరాను. కుమార్ నావెంట నడుస్తున్నాడు. నేను నడుస్తున్నానన్న మాటేకానీ- నా మనస్సు అక్కడ లేదు. అదెప్పుడో ఎగిరి మా ఊరి పొలిమేరల్లో వాలింది.

మిద్దింటోళ్ళంటే ఆ పాయకట్టులో ఒక విధంగా మకుటం లేని మహారాజులు. పది పన్నెండు మడకల సేద్యం. నాయనచెరువు కింద బంగారుపండే ఇరవైఎకరాల నంజ. ఏడాదికి ఎలా లేదన్నా నాలుగైదువందల బస్తాల శెనక్కాయలు పండే పుంజ. నీళ్ళడిగితే నీరు మజ్జిగ ఇచ్చే ఔదార్యం. ఆ ఇంట్లో చెయ్యి కడగనివాడు పాపాత్ముడు. వాళ్ళు కట్టేంత కిస్తీ కట్టేవాళ్ళు ఆ పాయకట్టులో మరొక్కరు లేరు. అలాంటి ఇంట్లో పుట్టినవాడికీగతి ఎందుకు పట్టింది?

నేను పుట్టింది కూడా ఆ ఊళ్ళోనే. అయితే కూడా వాళ్ళతో పోలిస్తే నేను చాలా పేదవాణ్ణి. వాళ్ళ ఎదురుగా నిలబడే యోగ్యతకూడా ఆరోజుల్లో నాకు లేదు. అయినా నేనంటే

ఆ ఇంట్లో ప్రతిఒక్కరికీ అభిమానం. బాగా చదువుకుంటానని ఎంతో మెచ్చుకొనేవాళ్ళు. అంతోఇంతో సహాయపడేవాళ్ళు కూడా! ఎన్నివిధాల ఆలోచించినా మిద్దింటాయన కొడుక్కి ఈ గతి పట్టడానికి ఆస్కారమే తోచలేదు.

నా ఆలోచనలతో సతమతమవుతూ నేను నడుస్తున్నాను. కుమార్ నన్ను వెంబడించి వస్తున్నాడు. నోళ్ళు విప్పలేకపోతున్నాం. కనీసం ఒకరినిఒకరు చూసుకోలేక పోతున్నాం.

వీధుల్లో రద్దీ కాస్త తగ్గింది. అంగళ్ళు మూతలుపడుతున్నాయి. మునిసిపాలిటీ వీధి దీపాలు మేమున్నామంటూ చావుతెలివితో వెలుగుతున్నాయి– అక్కడొకటి అక్కడొకటిగా! నా మనస్సుతో వీధి కుక్కలు ఘోరంగా శ్రుతి కలుపుతున్నాయి.

ఇంటిముందర వీధివాకిటి మెట్లెక్కపోతూంటే పట్టినిపిలిపాడు కుమార్. నిలబడ్డాను.

నా మొగంలోకి సూటిగా చూస్తూ ఒక నవ్వు నవ్వాడు– సన్నగా!

నాతల వాలిపోయింది!

"మిద్దింటాయన కొడుక్కీగతి ఎందుకు పట్టిందని ఆలోచిస్తున్నావు కదూ?"

తలాడించాను– మాటలు రానట్లుగా!

మూడేండ్ల కిందటే మిద్దింటి పెద్దాయన పోయాడు. తల పోవడంతో ఆ ఇల్లు తలాతోకా లేకుండా తయారయింది. ఆ కుటుంబం వేర్లు పొయ్యింది."

"పోతే?"

"పోతే మిద్దిల్లు నాలుగుదోవలయింది. ఎవడిదోవ వాడిదయింది. ఆ ఇంటికి ఒకే దోవ ఉన్నప్పుడు ఆ దోవే వేరు. ఆదోవలో ఆ ఇంటి పరపతేవేరు. ఉన్న ఆస్తిని నలుగురు నాలుగంతలెత్తుకుంటే బతుకు కుక్కలు చింపిన విస్తరి మాదిరయ్యింది. వాళ్ళ ఆటల ముందరా ఆస్తి ఉప్పుకా? ఊరగాయకా?"

"అంటే?"

"అంటేనా? ఒకడు జూదగాడైతే ఇంకొకడు పక్కా తాగుబోతయ్యాడు. ఇంకొక్కడు 'మీకంటే నేను తీసిపోతానా?' అని గుర్రప్పందేలకే తయారయ్యాడు. కొంతకాలానికి జూదగాడి ఆటకు ఆ పల్లెస్థాయి చాలలేదు. ఇక్కడ క్లబ్బులో మెంబరయ్యాడు. తాగుబోతుగాడికి పల్లెలో దొరికే నాటుసారాయి పట్టలేదు. అతగాడిక్కడ బార్లోనే కాపురం పెట్టాడు.

"చాలా విషమించాయే పరిస్థితులు!"

"అవును. దినము ఒకరాతిని తీస్తే కొండయినా తరుగుతుంది. చేతికి రూక కావలసినపుడంతా అమ్ముతూపోతే చేతికి చిప్పే మిగులుతుంది. ఇద్దరూ బికార్లయ్యారు. అందులో ఆ తాగుబోతు వెధవ కొంపలో చేతికేమి దొరక్కపోతే నడివీధి చేదబావిలో నీళ్ళు చేదుతూ ఉండిన పెళ్ళాం మీద పడి నలుగురు సరి ఆడవాళ్ళున్నారన్న బుద్ధికూడా లేకుండా తాను గట్టిన తాళినే తెంచుకొన్నాడు."

"నిజమా?"

"నీతో అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేంవీలేదు. ఆ ఇల్లాలికి సరి ఆడవాళ్ళముందర తలకొట్టేసినట్లయింది. ఊళ్ళో తలెత్తుకొని తిరగలేకపోయింది. అసలే అది పల్లెటూరు. గోరంతను కొండంతలు చేయడం అక్కడ పరిపాటి. అభిమానం కాళ్ళకు సంకిళ్ళయితే ఆ ఇల్లాలు ఇల్లు విడిచి వీధిలో అడుగుపెట్టలేకపోయింది. ఎంతకాలమని అలా ఉండగలుగుతుందని? ఒక్కనాటి అర్ధరాత్రి కన్నబిడ్డలతో సహా గంగపాలు కావాలనుకొనింది. ఆ బిడ్డల్ని ఈడ్చుకొని బయలుదేరితే– తీరా బావి దగ్గరికి వెళ్ళేటప్పటికి బిడ్డలు తప్పించుకొని పారిపోయారు. ఆమె బావిలో దూకి ఆత్మహత్య చేసుకొనింది. ఆ బిడ్డల్ని సాకడానికి ఆ పుణ్యాత్ముడీ అవతారమెత్తినాడు."

నా తల తిరిగిపోతూ ఉంది.

జిన్నుకైపు అయిపులేకుండా పోయింది.

"ఇది వాస్తవం. ఈ వాస్తవానికి కల్పనతోడయితే కథ అవుతుంది. రాయి. రాసి ఇలాంటి బతుకుల్లో దివ్వెలు వెలిగించు."

నేను రాస్తానో? రాయలేనో? నా ఈ రాతవల్ల ఎంతమంది చీకటి బతుకుల్లో దివ్వెలు వెలుగుతాయో? నాకు తెలియదు. అయితే ఆక్షణంలో మాత్రం నా గుండెల్లో కోటి దివ్వెలు వెలిగాయి!

వెలిగినదీపమే మరికొన్ని దీపాల్ని వెలిగిస్తుంది!

ఆమీదట మీ సాక్షిగా చెపుతున్నాను– నేను తాగుంటే ఒట్టు! ●

స్వాతి మాసపత్రిక
(1, జూలై 1983)